'400+' నినాదం విఫలం

బీజేపీని ఎద్దేవా చేసిన అఖిలేశ్

ధియోరియా, మే 25: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎత్తుకొన్న '400+' నినాదం విఫలమవుతుందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. మొత్తం లోక్‌సభ స్థానాలకు(543) గానూ కనీసం మిగిలిన 140 స్థానాల్లోనైనా విజయం సాధించాలని ఆ పార్టీ అనుకొంటున్నదని పేర్కొన్నారు. యూపీలోని ధియోరియా నియోజకవర్గంలో ఎస్పీ అభ్యర్థి తరపున అఖిలేశ్ శనివారం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు గాలి విపరీతంగా వీస్తుందన్నారు. ఫలితాల రోజున కమలం పార్టీకి గట్టి షాక్ తప్పదని, రాష్ట్రంలో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అఖిలేశ్ పేర్కొన్నారు.

ఆనందం అగ్నికి ఆహుతి

గేమ్ జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం

గుజరాత్‌లో 27 మంది దుర్మరణం

రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో వేసవి సెలవులను ఆనందంగా గడపాలనుకున్న బాలలు, పెద్దలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. శనివారం సాయంత్రం టీఆర్‌పీ గేమ్ జోన్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం వీరి సంతోషాన్ని ఆవిరి చేసింది. ఈ దారుణ సంఘటనలో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో తొమ్మిది మంది పిల్లలు ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సందర్శకులంతా ఆటల్లో నిమగ్నమైన సమయంలో మంటలు చెలరేగాయి. తక్షణమే సహాయ కార్యక్రమాలు చేపట్టాలని, గాయపడినవారికి చికిత్స చేయించాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ ఫ్యాక్టరీలో పేలుడు.. పలువురి ఆచూకీ గల్లంతు

ఛత్తీస్‌గఢ్‌లోని బెమెతార జిల్లాలో గన్‌పౌడర్ తయారీ కర్మాగారంలో శనివారం సంభవించిన పేలుడులో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోగా, ఆరు గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం, ఈ కర్మాగారంలో దాదాపు 100 మంది పని చేస్తున్నారు. ఈ పేలుడు తర్వాత కొందరి ఆచూకీ తెలియడం లేదని సమాచారం.

ఆరో విడతలో 59% పోలింగ్

- పశ్చిమ బెంగాల్‌లో అధికం.. ఢిల్లీలో అత్యల్పం
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- బెంగాల్‌లో స్వల్ప ఉద్రిక్త ఘటనలు

మిడ్నాపూర్(పశ్చిమ బెంగాల్)లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడ్డ మహిళలు

న్యూఢిల్లీ, మే 25: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం దేశవ్యాప్తంగా జరిగిన ఆరో విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ప్రకటన ప్రకారం రాత్రి 7.45 గంటల వరకు 59.06 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా బెంగాల్‌లో 52 శాతం, అత్యల్పంగా ఢిల్లీలో 34.4 శాతం ఓటింగ్ నమోదైంది. ఆరోవిడత ఎన్నికల్లో ఆరు రాష్ట్రాలు, రెండు యూటీల్లోని 58 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. ఢిల్లీలోని 7 లోక్‌సభ నియోజక వర్గాలు, యూపీలో 14, హర్యానాలోని మొత్తం 10, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో 8 చొప్పున, ఒడిశాలో 6, జార్ఖండ్‌లో 4, జమ్ము-కశ్మీర్‌లో ఒక నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు ఒడిశాలోని 42 అసెంబ్లీ నియోజవర్గాలు, హర్యానాలోని కర్నల్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక జరిగింది.

ఓటేసిన రాష్ట్రపతి, ప్రముఖులు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సహా పలువురు ప్రముఖులు ఆరో విడత ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతితో పాటు ఉప రాష్ట్రపతి ధన్‌కర్, కేంద్ర మంత్రులు ఎస్.జయశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఢిల్లీ మంత్రి అతిశీ, కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఓటేశారు. పోలింగ్ బూత్‌లో తొలి పురుష ఓటర్‌గా ఓటు హక్కును వినియోగించినందుకు అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్‌ను మంత్రి జయశంకర్ షేర్ చేశారు.

బీజేపీ అభ్యర్థిపై రాళ్ల దాడి

ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. జర్గ్రామ్ బీజేపీ అభ్యర్థి ప్రణత్ తుడుపై రాళ్ల దాడి చేయడంతో ఆయన భయంతో పరుగులు తీశారు. కాగా, ఈవీఎం మొరాయించిందని సీపీఐ(ఎం) నేత బృందా కారత్, తమవారిని అడ్డుకోవడంపై మెహబూబా ముఫ్తీ నిరసన తెలిపారు.

ఢిల్లీలో ఓటేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి ధన్‌కర్, కేంద్ర మంత్రి ఎస్.జయశంకర్, సీఈసీ రాజీవ్‌కుమార్, భార్య కల్పనతో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, ప్రియాంక వాద్రా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

ఈవీఎంలపై బీజేపీ ట్యాగ్‌లు

ఫొటోలు పోస్ట్ చేసిన తృణమూల్ కాంగ్రెస్

వివరణ ఇచ్చిన ఎన్నికల ప్రధానాధికారి

కోల్‌కతా, మే 25: ఆరో దశ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ఈవీఎంలకు 'బీజేపీ' అని రాసి ఉన్న ట్యాగ్‌లు ఉండటం వివాదాస్పదంగా మారింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పోస్ట్ చేసింది. కాగా, ఈ విషయంపై బెంగాల్ ఈసీ వివరణ ఇచ్చారు. 'పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లను పెట్టేటప్పుడు అక్కడ ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లతో అడ్రస్ ట్యాగ్‌లపై సంతకాలు చేయిస్తాం. 56, 58, 60, 61, 62 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లు పెట్టేటప్పుడు బీజేపీ అభ్యర్థికి సంబంధించిన పోలింగ్ ఏజెంట్లు మాత్రమే ఉండటంతో ముందుగా వారి సంతకాలు తీసుకున్నాం. పోలింగ్ జరిగేటప్పుడు మిగతా అందరి ఏజెంట్ల సంతకాలు కూడా పెట్టించాం. ఈ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలు అన్నీ పాటించాం.' అని వివరణ ఇచ్చారు.

ముస్లింల ఓట్ల కోసం 'ముజ్రా' చేస్తారు

ఇండియా కూటమిపై మోదీ వ్యాఖ్యలు

పట్నా, మే 25: ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఇండియా కూటమి 'ముజ్రా'(నృత్యం) చేస్తుందని, బానిసత్వం ప్రదర్శిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను దోచేసి ముస్లింలకు మళ్లించేందుకు ఇండియా కూటమి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన పేర్కొన్నారు. శనివారం బిహార్‌లోని పట్లిపుత్ర, కరాకట్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొన్నారు. 'ఓట్ జిహాద్'కు పాల్పడున్న వారి మద్దతుపై ఇండియా కూటమి ఆధారపడిందని ఆయన పేర్కొన్నారు. ఇండియా కూటమి గెలిస్తే ముస్లింలకు రిజర్వేషన్లు మళ్లించేందుకు కోర్టులు కూడా జోక్యం చేసుకోకుండా రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్నారు.

ప్రధాని మాట్లాడేది ఇలాంటి భాషనా: ఆర్జేడీ

ప్రధాని మోదీ చేసిన 'ముజ్రా' వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత మనోజ్ కుమార్ ఝా తీవ్రంగా స్పందించారు. 'మచిలీ(చేపలు), మటన్, మంగళసూత్రాల తర్వాత ఇప్పుడు ముజ్రా వంతు వచ్చింది. దేశ ప్రధాని ఇలాంటి భాష మాట్లాడటం తగునా ? ప్రధాని మోదీకి చెందిన కులం లాంటిదే ముస్లింలలోనూ ఉంది. వారు గుజరాత్‌లో రిజర్వేషన్లు పొందుతున్నారు.' అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని వ్యాఖ్యలను ఎస్సీపీ(ఎస్పీ), కాంగ్రెస్ కూడా ఖండించాయి.

మంచి మార్గంలో విమర్శలు చేయాలి

10 ఏండ్లలో గట్టి విపక్షాన్ని చూడలేకపోయా: మోదీ

న్యూఢిల్లీ, మే 25: మతపరమైన అంశాలను ముడిపెట్టి ఈ ఎన్నికల్లో విపక్షాలపై తీవ్ర విమర్శలకు పాల్పడుతున్న ప్రధాని మోదీ.. విమర్శ సరైన రీతిలో ఉండాలని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో విపక్షాల నుంచి గట్టి ప్రతిఘటన ఎదుర్కొంటున్న ఆయన తన పదేండ్ల పాలనలో పటిష్టమైన ప్రతిపక్షాన్ని చూడలేకపోయానన్నారు. సీఎన్ఎన్-18 న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రజా జీవితంలో పలికే మాటలకు హుద్దులు ఉండాలని, సరసమైన పదాలను వాడితే బాగుంటుందని సూచించారు. తన పదవీ కాలంలో కాంగ్రెస్ నుంచి ఎలాంటి సానుకూల భాగస్వామ్యాన్ని పొందలేకపోయానన్నారు.

బీజేపీకి 240-260 సీట్లే!

రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధిస్తామంటూ బీజేపీ చేస్తున్న ప్రచారం బూటకమని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ అన్నారు. 'ఈ ఎన్నికల్లో బీజేపీకి 240-260 మధ్య సీట్లు రావొచ్చు. ఎన్డీయే కూటమిలోని మిగతా పార్టీలు 35-45 సీట్లు గెలవొచ్చు. ఇక కాంగ్రెస్‌కు 85-100 స్థానాలు లభించవచ్చు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ మిత్రపక్షాలకు 120-135 సీట్లు రావొచ్చు' అని పేర్కొన్నారు. ఏపీలో లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ కూటమికి 15 సీట్లు రావొచ్చని తెలిపారు. టీడీపీ-జనసేనకు 12, బీజేపీ మూడు సీట్లు నెగ్గవచ్చని అంచనా వేశారు.

పోల్ డాటాను ఎవరూ మార్చలేరు: ఈసీ

ఐదు దశల పోలింగ్ డాటా విడుదల

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికల్లో భాగంగా తొలి ఐదు దశల్లో పోల్ అయిన ఓట్ల వివరాలను ఎన్నికల కమిషన్ (ఈసీ) శనివారం విడుదల చేసింది. పోలింగ్ ముగిసిన దశల్లో పోల్ అయిన ఓట్ల డాటాను ఎవరూ మార్చలేరని తెలిపింది. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ జరిగిందని, అప్పటి నుంచి తాము విడుదల చేస్తున్న డాటా అత్యంత కచ్చితమైనదని, ఎటువంటి వ్యత్యాసాలు, లోపాలు లేనిదని వివరించింది. ఈ డాటాను ఎన్నికల చట్టాలకు అనుగుణంగా విడుదల చేస్తున్నట్లు స్పష్టం చేసింది. పోల్ అయిన ఓట్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియ, భద్రపరచే తీరు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ ఉండే ఏజెంట్ల వద్ద ఉండే ఫారం 17సీని ఉపయోగించడం వంటివాటి గురించి ఈసీ వివరించింది. ఫారం 17సీ ఉండటం వల్ల పోల్ అయిన ఓట్ల డాటాను ఎవరూ మార్చలేరని తెలిపింది. పోల్ అయిన ఓట్ల వివరాలను ఈసీ విడుదల చేయాలని కోరిన పిటిషనర్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది.

నియోజకవర్గాలవారీగా మొత్తం ఓటర్లు, పోల్ అయిన ఓట్ల వివరాలు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. యాప్‌లో ఈ డేటా ప్రజలకు అందుబాటులో ఉన్నాయంది. తనపై వస్తున్న ఆరోపణలను కొట్టిపారేస్తూ, ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది.

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

మొదటిపేజీ తరువాయి...

అమర్చాలనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం గుజరాత్‌కు గత ఐదేండ్లలో రూ.16,663 కోట్లు మంజూరు చేసింది. ఆ రాష్ట్రంలో పాత మీటర్ల స్థానంలో 1.64 కోట్ల స్మార్ట్ మీటర్లను అమర్చాలని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికి 60 వేల స్మార్ట్ మీటర్లను ఇన్‌స్టాల్ చేశారు. ఈ మీటర్లను విద్యుత్తు కార్యాలయాల నుంచి ఆపరేట్ చేయొచ్చు. విద్యుత్తు ఎంత వాడారనేది ప్రతి అరగంటకు ఒకసారి వినియోగదారుడి ఫోన్‌కు, సరఫరా సంస్థకు అప్‌డేట్స్ వెళ్తాయి. మీటరు వేడెక్కినా, ఏమైనా సమస్యలు ఉన్నా విద్యుత్ కార్యాలయం నుంచి మీటరును నిలిపివేసి, మళ్లీ ప్రారంభించవచ్చు. వినియోగదారులు ముందుగానే రీఛార్జ్ చేసుకొని విద్యుత్తును వినియోగించుకోవాలి. ఇందుకోసం ఎప్పుడూ రూ.300 మినిమం బ్యాలెన్స్ కలిగి ఉండాలి.

స్మార్ట్ మీటర్లపై వడోదరలో నిరసన

ఆందోళనలతో తాత్కాలికంగా నిలిపివేత

అకౌంట్‌లో బ్యాలెన్స్ అయిపోగానే ఆటోమెటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ వినియోగం గత ఏడు రోజుల సగటు కంటే పెరిగినప్పుడు, అకౌంట్‌లో ఉన్న బ్యాలెన్స్ రెండు రోజులకు మించి వచ్చే అవకాశం లేనప్పుడు, అకౌంట్‌లో డబ్బులు అయిపోయినప్పుడు వినియోగదారుల ఫోన్‌కు అప్‌డేట్స్ వెళ్తూ ఉంటాయి. అయితే, ఈ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే రూ.10 వేల జరిమానా వేస్తామని బలవంతంగా అమర్చారని, ఇప్పుడు తమ విద్యుత్ బిల్లులు పెరిగిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు లేని వారి పరిస్థితి ఏంటని, నిరక్షరాస్యులు ఎలా ఈ స్మార్ట్ మీటర్లను అర్థం చేసుకోగలరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో విద్యుత్ సరఫరా సంస్థలు తాత్కాలికంగా ఈ స్మార్ట్ మీటర్లను అమర్చే కార్యక్రమాన్ని నిలిపివేయాల్సి వచ్చింది.

వాట్సాప్ డాటా భద్రత భ్రమే!

ప్రతి రోజు రాత్రి మీ సమాచారం ఎక్స్‌పోర్టింగ్

'ఎక్స్' సీఈవో మస్క్ సంచలన ఆరోపణలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): సాధారణ ఫోన్ కాల్స్‌ను ట్యాపింగ్ చేసే అవకాశాలు ఉంటాయని చాలా మంది ముఖ్యమైన ఫోన్ కాల్స్‌ను, మెసేజ్‌లను వాట్సాప్ ద్వారా పంపిస్తారు. 'ఎండ్-టూ-ఎండ్ ఎన్‌క్రిప్షన్' ఫీచర్ ఉండటమే దీనికి కారణం. అయితే, వాట్సాప్‌లో కూడా యూజర్ల డాటాకు భద్రత లేదని స్పేస్ ఎక్స్, టెస్లా, ఎక్స్ తదితర దిగ్గజ కంపెనీల సీఈవో ఎలాన్ మస్క్ ఆరోపించారు. ప్రతి రోజు రాత్రి యూజర్ల డాటాను వాట్సాప్ ఎక్స్‌పోర్ట్ చేస్తున్నదని సంచలన వ్యాఖ్యలు చేశారు.

అసలేం జరిగిందంటే?

యూజర్ల సమాచారాన్ని ప్రతి రోజు రాత్రి వాట్సాప్ ఎక్స్‌పోర్ట్ చేస్తున్నదని, ఈ సమాచారాన్ని విశ్లేషించిన తరువాత అడ్వర్టైజ్‌మెంట్ కోసమని వాడుకొంటున్నదని ఎక్స్‌లో ఓ యూజర్ పోస్ట్ చేశాడు. యూజర్లను వాట్సాప్ కంపెనీ ఓ కస్టమర్‌గా కాకుండా ఓ వస్తువుగా చూస్తున్నదని మండిపడ్డాడు. దీనిపై స్పందించిన మస్క్.. 'ప్రతి రోజు రాత్రి మీ డాటాను వాట్సాప్ ఎక్స్‌పోర్ట్ చేస్తున్నది. కానీ, కొంతమంది ఇంకా వాట్సాప్‌లో తమ డాటా భద్రంగానే ఉన్నదన్న భ్రమలో ఉన్నారు' అని బదులిచ్చారు. అయితే, మస్క్ వ్యాఖ్యలపై అటు వాట్సాప్ గానీ, దాని పేరెంట్ కంపెనీ మెటా గానీ ఇంకా స్పందించలేదు. కాగా, మెటా, వాట్సాప్‌లపై గతంలోనూ మస్క్ ఇలాంటి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.



కర్ణాటక కాంగ్రెస్‌లో కల్లోలం?!

- పతనం అంచుకు సిద్ధరామయ్య సర్కారు?!
- ఎన్నికలు కాగానే ప్రభుత్వం కూలిపోవచ్చు
- మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై జోస్యం
- రాష్ట్ర సర్కారు అస్థిరతతో ఉందంటున్న విశ్లేషకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ అస్థిరత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కొద్దిరోజుల క్రితం హిమాచల్‌ప్రదేశ్‌లో పతనం అంచు వరకూ చేరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు ఆ గండాన్ని గట్టెక్కింది. అయినప్పటికీ ఆ పార్టీలో ఇప్పటికీ లుకలుకలు ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. తాజాగా కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పతనం అంచుకు చేరుకొన్నట్టు పెద్దయెత్తున వార్తలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ నేతలే కాదు సొంతపార్టీలోని ప్రముఖ వ్యక్తులు కూడా ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ఈ వాదనకు మరింత బలాన్ని ఇస్తున్నది.

ఆ ఇద్దరి మధ్య అంతర్గత పోరు

లోక్‌సభ ఎన్నికలు పూర్తవగానే కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని మాజీ సీఎం, బీజేపీ నేత బసవరాజ్ బొమ్మై జోస్యం చెప్పారు. పార్టీలో ఇద్దరు ప్రధాన నేతల మధ్య నెలకొన్న అంతర్గత కుమ్ములాటలే దీనికి కారణమని వెల్లడించారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య నెలకొన్న పోటీ చివరకు ప్రభుత్వాన్ని కూల్చేలా చేస్తుందన్నారు. లోక్‌సభ ఫలితాలు వచ్చాక జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ రెండుగా నిట్టనిలువుగా చీలిపోతుందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో ప్రభుత్వం కూడా కూలిపోతుందని పేర్కొన్నారు.

సిద్ధరామయ్య బసవరాజ్ బొమ్మై

నా నాయకత్వంలోనే అధికారం

కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా పరోక్షంగా ఈ తరహా వ్యాఖ్యలే చేయడం సంచలనంగా మారింది. తన నాయకత్వంలోనే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని డీకే ఇటీవల పేర్కొన్నారు. పరోక్షంగా తాను సీఎం కాబోతున్నట్టు చెప్పుకొచ్చారు. మరోవైపు జూన్ 4 తర్వాత కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పులు జరుగొచ్చని స్థానిక మీడియాలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది. ఇదిలా ఉండగా.. కర్ణాటక కాంగ్రెస్‌లో 'నాథ్ ఆపరేషన్' జరుగుతుందని, త్వరలోనే ప్రభుత్వం కూలిపోవచ్చని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. అవన్నీ చూస్తుంటే పతనం అంచుకు సర్కారు చేరుకొన్నట్టు అర్థమవుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మోదీ బస బిల్లు కోసం కోర్టుకు హోటల్

మైసూరు: ప్రధాని మోదీ బస చేసిన బిల్లును సంబంధిత అధికారులు చెల్లించకపోవంతో మైసూరులోని ఓ హోటల్ కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నది. ప్రాజెక్ట్ టైగర్ 50వ వార్షికోత్సవాల సందర్భంగా మోదీ ఇక్కడ బస చేశారు. ఈ కార్యక్రమాలను జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ), పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్) 2023 ఏప్రిల్‌లో నిర్వహించాయి. తమకు రూ.80.6 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉందని హోటల్ మేనేజర్ తెలిపారు. ఈ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ఎన్‌టీసీఏ చెప్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చెల్లించడం లేదు. దీంతో ఈ బిల్లు కోసం కోర్టుకు వెళ్లాలని హోటల్ యాజమాన్యం భావిస్తున్నది.

ఉద్యోగం కోసం వెళ్లి బానిసలయ్యారు!

న్యూఢిల్లీ: బ్యాంకాక్‌లో అధిక జీతంతో ఉద్యోగాలిప్పిస్తానంటూ ఓ దుబాయ్ ఏజెంట్ చేసిన మోసం 20 మంది భారతీయులను మయన్మార్‌లో నిర్బంధ కార్మికులుగా మార్చింది. అటవీ ప్రాంతంలో నిర్బంధించిన వారితో 18 గంటలపాటు పని చేయించుకుటున్నారని, సరైన తిండి కూడా పెట్టడం లేదని, వెంటనే వారిని కాపాడాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు భారత విదేశాంగ శాఖను ఆశ్రయించారు.

ఏడుగురు బాలికలపై లైంగిక దాడి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సిద్ధ్ జిల్లాలో బ్రజేశ్ ప్రజాపతి అనే వ్యక్తి ఏడుగురు గిరిజన బాలికలపై దారుణమైన ఆకృత్యాలకు పాల్పడ్డాడన్న విషయం ఆలస్యంగా బయటపడింది. వాయిస్ చేంజింగ్ యాప్‌ను ఉపయోగించి ఓ మహిళా టీచర్ మాట్లాడుతున్నట్టు ఫోన్ ద్వారా అతడు బాలికలను మోసం చేసేవాడని, స్కాలర్‌షిప్స్ గురించి మాట్లాడేందుకు నిర్మానుష్య ప్రాంతాలకు ఆ బాలికల్ని రప్పించి లైంగికదాడికి పాల్పడేవాడని సిద్ధ్ జిల్లా పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

పంజాబ్‌లోనూ 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ'

చండీఘడ్: ఇండ్లు, భవనాల పైకప్పులపై భిన్నమైన ఆకృతుల్లో నిర్మాణాలు చేపట్టడం, విగ్రహాల్ని ఏర్పాటు చేయడం పంజాబ్‌లోని టార్న్ తరన్ ప్రాంతం ప్రత్యేకత. ఇప్పుడు అక్కడ ఒక భవనంపై 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ'ని అచ్చం అమెరికాలో ఉన్నట్టే నిర్మిస్తున్నారు! న్యూయార్క్‌లో ఉన్నంత పెద్దగా కాకపోయినా తమ గ్రామంలో అత్యంత ఎత్తుగా ఉన్న భవనంపై ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నట్టు స్థానిక గ్రామస్థులు తెలిపారు.

ఏఐసీటీఈ కెరీర్ పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ, మే 25: మన దేశంలో ఏడాదికి దాదాపుగా *20* లక్షల మంది ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసుకొని పట్టా అందుకుంటున్నారు. ఏటా జాబ్ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్న వీరికి సరిపడా ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమవుతున్నది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) నిరుద్యోగులకు కాస్త ఊరట కల్పించే ప్రయత్నం ప్రారంభించింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్‌లు పొందేందుకు ఉపయోగపడేలా 'అప్న' ప్లేస్‌మెంట్ ఏజెన్సీతో కలిసి స్టూడెంట్ కెరీర్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇందులో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని తమ నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగాలు వెతుక్కునేందుకు అవకాశం ఉంటుంది. https://student-career-portal.aicte-india.org ద్వారా ఈ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చు.



కొవిడ్‌తో ఆయుర్దాయంలో కోత

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాపంగా ఆరోగ్యవంతమైన మానవుల ఆయుఃప్రమాణాన్ని కొవిడ్-*19* మహమ్మారి తగ్గించినట్లు డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. ఆయుర్దాయాన్ని పెంచేందుకు పదేండ్లలో సాధించిన ప్రగతిని కేవలం రెండేండ్లలో ఈ మహమ్మారి తుడిచి పెట్టేసిందని చెప్పింది. *2019* నుంచి *2021* వరకు ప్రపంచవ్యాప్తంగా ఆయుఃప్రమాణం *1.8* సంవత్సరాలు తగ్గి, *71.4* సంవత్సరాలకు చేరిందని, అంటే *2012* నాటి స్థాయికి తిరిగి వెళ్లినట్లని వివరించింది. *2021*లో ప్రపంచంలో ఆరోగ్యవంతమైన జీవితాన్ని జీవించే వ్యక్తుల ఆయుర్దాయం *1.5* సంవత్సరాలు తగ్గి, *61.9* సంవత్సరాలకు చేరిందని, ఇది కూడా *2012* నాటి స్థాయేనని చెప్పింది. అమెరికా, ఆగ్నేయాసియా దేశాలపై కొవిడ్ ప్రభావం ఎక్కువగా పడినట్లు డబ్ల్యూహెచ్ఓ నివేదిక తెలిపింది. *2019-2021* మధ్య ఆయుర్దాయం దాదాపు మూడేళ్ల తగ్గిందని, ఆరోగ్యవంతమైన ఆయుష్షు *2.5* సంవత్సరాలు తగ్గిందని వివరించింది.

చేప నూనె సప్లిమెంట్స్‌తో గుండె జబ్బులు

న్యూఢిల్లీ, మే *25:* చేప నూనె సప్లిమెంట్లను తరచూ వినియోగించడం వల్ల మనుషుల్లో గుండె జబ్బులు పెరుగుతున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. చేప నూనెలో ఒమేగా-*3* కొవ్వు ఉంటుందని, వీటి సప్లిమెంట్లను సాధారణంగా గుండె సమస్యలను తగ్గించడానికి వినియోగిస్తారని, కానీ, ఇవి విరుద్ధంగా పనిచేస్తున్నాయని తేలింది. ఈ అధ్యయనాన్ని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురించారు. *2006* జనవరి *1* నుంచి *2021* మార్చి *31* వరకు యూకే బయో బ్యాంకు అధ్యయనం నుంచి దాదాపు *12* ఏండ్ల డాటాను పరిశోధకులు విశ్లేషించారు. ఈ పరిశోధనలో యూకేలోని *40-69* ఏండ్ల మధ్య వయసు గల *4.15* లక్షల మంది పాల్గొన్నారు. శ్వేతజాతీయులు మూడింట ఒక వంతు మంది చేప నూనె సప్లిమెంట్స్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటారు. చేప నూనె సప్లిమెంట్స్ క్రమం తప్పకుండా తీసుకొనే వారికి హృదయ స్పందనలో తేడాలు వచ్చినట్టు అధ్యయనంలో వెల్లడయింది.

వయసు కొంచెం.. 'కుంచె' ఘనం!

ఘనా: ఘనాకు చెందిన ఒక బుడతడు ఏడాది వయసుకే గిన్నీస్ బుక్ రికార్డు పట్టేశాడు. ప్రపంచంలోని అత్యంత పిన్న వయస్కుడైన పురుష